# ఏం ఘోరం

ఇది పరిపాటి అయిపోయింది. ఒక్క సీతాకోక చిలకా నా సరసకేనా రాదు. నా సరసకు రాకపోయినా నే నాట్టే బాధపడను. మరీ పచ్చి అన్యాయం. ఆ రంగనాథరావు దగ్గిరే వచ్చి వాల్తాయ్. ఏం ఘోరం? నేను కాబట్టి ఇన్నాళ్ళనుంచీ మనస్సులో పెట్టుకుని మరీ బయట పడే స్తున్నాను గానీ, యింకొకడైతేనా? ఏనాడో రంగనాథరావును గూబ కదిపేశుండును.

అసలు జరిగేదీ, జరిగిందీ ఏమిటంటే—నిన్నా మొన్నా మాట కాదు, చూస్తున్నాగా నేను. రంగనాథరావు తొమ్మిదణాల టిక్కెట్టే కొంటాడు. సినిమాకు వొస్తాడు. నేనూ. తొమ్మిదణాల టిక్కెట్టే కొంటాను. సాధారణంగా సినిమాకంటూ వెళ్ళినప్పుడల్లా అతను తటస్త పడి తీరుతాడు. మా యిద్దరికీ పోటీ పరీక్ష పెట్టాడో భగవంతుడు? లేక

పోతే—మా యిద్దరికీ అభిరుచి కేవలం ఒక్కటైనా ఊహించుకుంటున్నదో అల్లాగే అందాం అనుకున్నా మరి మా యిద్దరి టేస్టూ ఒక్కటే లెవల్‌లో ఇరికింది గదా, మరి ఏమిటి చిలకల పక్షపాతం?

మినర్వాలో ఇడియట్స్ డిలైట్, పేస్టెండ్‌లో గాన్ విత్ ది విండ్, ఎలిఫిన్‌స్టన్‌లో ఫాంటాసియా, మినర్వాలో నినోచ్కా, చిత్తగిస్తు న్నారా?

రాక్సీలో ది వే ఆఫ్ ఫ్లష్ అండ్ బ్లేడ్, ఎలిఫిన్‌స్టన్‌లో ది లిటిల్ ఫాక్సెస్, కాసినోలో అదేమిటి క్లార్క్ గేబుల్ ఉన్నాడు, న్యూ గ్లోబులో అరరే పేరు మరచాను—పోనీ, పాల్‌మూని యాక్టు చేశాడు; వాక టేమిటి?

ఉజ్జాయింపుగా మీకు పేర్లు చెప్పాను గానీండి. ఎక్కడికి పోయినా రంగనాథరావూ తగుదునమ్మా అంటూ తయారు, పోనీ అతనొచ్చి ఏమన్నా మాట్లాడతాడా? అబ్బే. నవ్వి ఎక్కడో అక్కడ ఇరుక్కుంటాడు. అతను రాగానే అందుకోసం కనిపెట్టు కూర్చున్నట్లు – ఈ అర్ధాంగ్లాం గనలు- అవే సీతాకోక చిలకలు ఎడా పెడా ఊపిరి సలపకుండా తయారు, నా పక్కలనో— గబ్బువాసన కొట్టే మురికి అవ్వా వాళ్ళు తప్పిస్తే పోలర్జుల్లా ఇంతకన్న పచ్చి అన్యాయం వేరే ఉందా?

అక్కడికీ పెందరాళే తెమిలి, స్నానం చేసి, శుభ్రంగా టాయ్ లెట్ చేసుకుని, ఉన్నంతలోనే మంచి సూట్ వేసుకుని, ఈ ముండలు వో వేళవొస్తే లోకువ అవుతాయేమో అని విల్స్ నావికట్ పాకెట్టే కొనుక్కుని, పండగనాడులా యింత మంచి మంచి ఐటములు. స్వీటూ హాటూ పూర్తిచేసి మరీ టిక్కెట్టు కొంటాను. ఏం చేస్తే ఏం— భగవంతుడి పరీక్షలో—అబ్బే పాతిక మార్కులు కూడా కటాక్షింప బడవు. ఖుదా.

పెందరాళే వెళ్ళి కూచుందాం. అదీ చూద్దాం అని ఆ ముచ్చటా తీర్చాను; చెప్పొద్దూ. కాస్త ఫరవాలేదు. ఎంతఏను మీసం తగలడ్డా, ఎంత ముసలి ముండైనా, ఓ ఆడదంటూ వొచ్చి—అదీ సందేహిస్తూనే పక్కన అఘోరించింది. 'ఏరేలే' అని అనుకుంటూ వున్నాను. ఆలస్యంగా రంగ నాథరావూ వొచ్చాడు. వెంటనే ఎవరో బొమ్మ తయారు. లైట్లు వెలిగాక చూద్దును గదా- దిల్ పసంద్-ఎందుకీ గిర్ గారనినూ, మేర్లీ ఓబెరాను దిష్టి తియ్యనా?

ఏం చెయ్యాలో చెప్పండి? ఏడవనా, నవ్వనా? దీం దుంపతెగా, నిజంగా మంచి పిక్చర్ గదా అని అక్కడికీ అఘోరిస్తూనే బయలు దేరాను. బస్సు ఆలస్యం చేసింది. ట్రాములో బతికి పడ్డాను. నా పక్క నేమో. ముసలి నాటురకం అవ్వ. ఆ చివర—లేచేప్పుడు చూశాను. రంగ—పూర్తిపేరు అంటానిక్కూడా మండుకొస్తోంది. రావు పక్కన వెన్నెల విసినకర్రలా: వాడేం వొకదానికి లంచం పెట్టడం లేదుగద, పోటీలో నెగ్గడానికి అయివుండదు. చేసేది పచ్చి నౌకరీ—అందులో లంచం పెట్టే తాఖతా? యుద్ధం వచ్చి బాగుపడ్డ వాళ్ళ గుమాస్తా కాదే? లంచం పెట్టి వుండడు. అతని స్టార్ అలా తిరిగింది. అంతే.

నెమ్మదిగా వెస్టెండ్ దగ్గిర ట్రాం దిగాను. తొందరగా టికట్ కొని అడుగు పెట్టాను. నా పక్క సీటు ఖాళీగానేవుంది. మించిపోలేదుగా ఎవతైనా చక్కనిది రాగూడదూ? ఉఁహూఁ. ఎవరోబైతు, గూడకట్టూ వాడూ వొచ్చికూచున్నాక—వోసుందరాంగి—పేడు ముఖంది. వొచ్చి చుట్టూ చూసి ఖాళీవుంటే కూర్చునే మొహం పెట్టి చక్కా పోయింది. పక్కనున్న వాణ్ణి....ఖాళీచేయించలేనుగదా. రంగనాథరావు ఏడీ? అని చూశాను. లేడు. ఎక్కడ కాపేస్తున్నాడో. దీపాలార్పారు. వార్ ట్రుమీ చూపిస్తున్నారు. రావు లేడుగదా అని తృప్తిగా ఊపిరి తీశాను. ఈ

కాస్త సుఖంగూడా భగవంతుడు దక్కనీడు. నాకు తెలుసు. చూస్తున్నాగా. ఏదితలపెట్టు- భగవంతుడూ ఎగస్పార్టీ?

నాణాలు దాచుకోగూడదన్న టుర్మీ చూసి, లైట్లు వేశారు. దిగాడు పూలరంగడు. వీడిదుంపతెగా, పక్కనేవుంది. నార్మాషేరార్ లాగా పొడుగాటి వేళ్ళూఅదీ సిగరెట్ తగలేస్తూ.

చెడ్డకాలుకొస్తోందిభాయ్. నిజం చెప్తున్నాను. ఛార్లెస్‌బోయర్ని చూడకుండానే బయటికి వొచ్చేద్దామా అనిపించిందంటే నమ్ము.

అడుగో రంగనాథరావు! నాకేం భయమా? మీ కళ్ళముందే నిలబెట్టి అడిగేస్తాను. అడిగేస్తానా? కడిగేస్తానా?

"హలో మిస్టర్ రావ్, నువునక్కనీ తొక్కొస్తావోయ్" అని అభినందించనా! రంగు తేలుతుంది!

"శాస్త్రీ! ఏమదృష్టవంతుడవోయ్. ప్రతిసారీ ఈ రాక్షసి పురుగులు ప్రక్కనజేరి కిలకిలమని చంపుకు తింటున్నాయోయ్. ఐ కంగ్రాట్యులేట్ యూ భాయీ! దూరంగా వుంటావేమో, తనవితీరా వాళ్ళని తినేట్టుచూస్తావు. నాకాభాగ్యంలేదు.పక్కనే తగలడతాడు. ఎల్లా చెప్పు.బావుంటుందా?మనం కోరేది-ఫక్తు చూపే అనుకో-వీలౌతుందా? నాగరికత వొప్పుకుంటుందా?

అక్కడికీ యివాళ పొద్దుపోయి వద్దామని, కేఫ్‌కుపోయి కాస్త టీ తాగి, సిగరెట్ కాల్చి మరీ తాత్సారం చేశా. ఉహుం. భగవంతుడు కన్నారా చూణ్ణీడాయె!"

"ఏం ఎత్తు వేస్తావ్ రావ్!"

"ఎత్తుకాదిదిభాయీ. క్షోభ. నా అదృష్టం ఇంతేలే. పక్కనే కుంపటిపెట్టిగాని భగవంతుడు పరీక్ష చెయ్యడంలేదు నన్ను. వొస్తా" అన్నాడు రంగనాథరావు. నిజమేనా యితని మాటలు?